క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌కు వీల్ చైర్ వితరణ



కామారెడ్డి టౌన్ : రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు వీల్‌చైర్‌ను వితరణ చేశారు. మంగళవారం రైల్వే స్టేషన్ మాస్టర్ సత్యంకు రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి, సభ్యులు ధనుంజయ, శ్రీశైలం, బాలరాజు, సుధాకర్, నాగభూషణం,తదితరులున్నారు.

రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలి



మాచారెడ్డి: ప్రతి రైతు తమ స్టార్టర్ బాక్స్‌లో తప్పనిసరిగా కెపాసీటర్లను బిగించుకోవాలని కామారెడ్డి ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం మాచారెడ్డి మండలం లచ్చపేటలో పొలంబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులకు ట్రాన్స్‌కో 24 గంటలుసేవలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. విద్యుత్ మరమ్మతులను రైతులు స్వయంగా చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నరేష్,ఏఈ తిరుపతి రెడ్డిలు సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ రవీందర్‌లు లైన్‌మెన్ దేవరాజులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మున్సిపల్‌కు సమీపంలోని ప్రియా జంట థియేటర్ల వద్ద రోడ్డుపై చెత్త పేరుకుపోయింది. నాలుగు రోజులుగా చెత్తను ఎత్తే వారే లేరని స్థానికులు వాపోయారు. ఆహ్లాదం కోసం సినిమాలకు వచ్చే ప్రేక్షకులతో పాటు వివేకానంద కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులకు మెలకువలు నేర్పాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత , శెట్పల్లిసంగారెడ్డి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాలను మంగళవారం అధికారులు, ఆయా పాఠశాలల విద్యార్థులు వీక్షించారు. లైబ్రరీ నిర్వాహణ, క్రీడా ప్రాంగణం, క్రీడల నిర్వాహణ, సైన్స్ ల్యాబ్, ఐఎఫ్‌పీ పనితీరు, గణిత ల్యాబ్, పాఠశాలల సమయసారిణి తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయన్న, శేషయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ సందర్శన



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం విజ్ఞాన విహార యాత్రకు తరలివెళ్లారు. నిజామాబాద్ జిల్లాలోని రుద్రూర్‌లోని ఫుడ్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్, రీజినల్ షుగర్ కేన్, రైస్ రీసెర్చ్ ఇన్స్‌స్టిట్యూట్‌ను సందర్శించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్ తెలిపారు. విద్యార్థులకు విషయ పరిజ్ఞానం కోసం విజ్ఞాన విహార యాత్రకు తీసుకు వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

పూర్వ విద్యార్థులు కళాశాలకు ఆస్తిలాంటి వారు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): పూర్వ విద్యార్థులు కళాశాలకు ఆస్తిలాంటి వారని ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. మంగళవారం మండలంలోని మర్కల్ గ్రామ స్టేజీ వద్ద గల మహిళ గురుకుల కళాశాలలో వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ మీన, కల్చరల్ కమిటీ కో–ఆర్డినేటర్ సిందూర, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎత్తిపోయిన బోర్లు.. ఎండుతున్న పంటలు

- నస్రుల్లాబాద్ మండలంలో సాగునీరు అందక పంట చేజారుతోందని రైతుల ఆవేదన
- పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు



మైలారంలో బీటలు వారిన పొలం



అన్నాసాగర్‌లో మేకలకు ఆహారంగా మారిన వరి పంట (ఇన్‌సెట్‌లో) సన్నగా పోస్తున్న బోరు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): భూగర్భ జలాలు తగ్గిపోవడం..ఎండలు ముదరడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. నిజాంసాగర్ ఆయకట్టు కింద ప్రాంతాల్లో ఆశాజనకంగా నీటిని అందించినా కూడా చివరి వరకు నీరు అందక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. నస్రుల్లాబాద్ మండల వ్యాప్తంగా 13,646 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం 1000 ఎకరాల్లో వరి పొలం ఎండిపోయిందని రైతులు చెబుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉండటంతో అప్పులు తెచ్చి మరీ రైతులు పంటలు సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో పొలాలకు నీరు అందక పోవడంతో గింజలు పొల్లుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 5 ఏళ్లలో మార్చిలో బోర్లు ఎత్తిపోలేదని రైతులు చెబుతున్నారు. పంటలు సాగు చేసిన రైతులకు అప్పులే మిగిలాయి.

కౌలురైతుల పరిస్థితి దారుణం

ఏళ్లుగా చేస్తున్న వ్యవసాయం కౌలుకు చేస్తున్న రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. పంట మొదట్లో నష్ట పోయినా భూ యజమానికి కారణం చెప్పొచ్చు. పంట పొల్లు పోయి పెట్టుబడి రాని సమయానికి అయితే కౌలు చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

పంట కాపాడేందుకు పాట్లు

బోర్లు ఎత్తి పోయి నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. పంట కాపాడేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. తోటి రైతుల పొలంలో నీటిని డబ్బులు ఇచ్చి మరీ తీసుకుంటున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని పైపులైన్ ద్వారా తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

పొలం బీటలు వారింది

ఆరు ఎకరాల్లో సాగు చేస్తే ఎకరన్నర ఎండిపోతుంది. బోరు ఎత్తి పోయి పొలం బీటలు వారింది. ఇరుగు పొరుగు వారి నీటిని అడిగి పంటలు పారిస్తున్నా. పంటలు చేతికి వచ్చే సమయంలో బోరు ఎత్తి పోవడంతో ఇబ్బందులు పడుతున్నా.

– గువ్వ నర్సయ్య, మైలారం

మూడు ఎకరాల్లో పంట ఎండిపోయింది

మూడు ఎకరాల్లో వరిపంట సాగు చేశా.ఎకరానికి రూ.40 వేల ఖర్చు పెట్టా. రెండు బోర్లు ఎత్తి పోవడంతో మూడు ఎకరాల వరిపంట ఎండిపోయింది. గత పదేళ్లలో ఇటువంటి పరిస్థితి రాలేదు.

– దడిగే పెద్దగంగారాం, మైలారం

రైతుల సంక్షేమానికి కృషి



పశువుకు టీకా ఇస్తున్న మనోజ్‌కుమార్

నిజాంసాగర్(జుక్కల్): రైతుల సంక్షేమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీలు కృషి చేస్తున్నాయని పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ పటేల్ అన్నారు. మంగళవారం మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామ పంచాయతీలో ఏఎంసీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సహకారంతో 10 వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే. మల్లికార్జున్, ఏఎంసీ కార్యదర్శి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బ సాయాగౌడ్, భాస్కర్‌రెడ్డి, కుమ్మరి రాములు, కృష్ణ, పశువైద్యులు సయ్యద్‌యూనుస్, శృతి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



బాన్సువాడ రూరల్/ రాజంపేట : ఇందిమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఈవో రాజు అన్నారు, బాన్సువాడ మండలం నాగారంలో డీఈవో రాజు, డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. రాజంపేట మండలం నడిమితండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మండల ప్రత్యేక అధికారి అపర్ణ, ఎంపీడీవో రఘురాం పరిశీలించారు. ఈకార్యక్రమంలో జీపీ కార్యదర్శులు నవీన్‌గౌడ్, సృజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైవేపై యూటర్న్‌లు ఏర్పాటు చేయాలి



నాగిరెడ్డిపేట : మండలకేంద్రం గోపాల్‌పేటలో చేపట్టిన జాతీయ రహదారిపై అవసరమున్నచోట యూటర్న్‌లు ఏర్పాటు చేయాలని స్థానిక వ్యాపారులు సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. మండలకేంద్రంలోని ఆర్యవైశ్యసంఘం కల్యాణమండపంలో స్థానిక వ్యాపారులతో కాంట్రాక్టర్ సమావేశమయ్యారు. హైవే నిర్మాణంతో గ్రామంలోని ప్రధాన రహదారికి ఒకవైపు నుంచి మరోవైపునకు దాటడం చాలా కష్టమవుతుందని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వ్యాపారులంతా కలిసి వినతిపత్రాన్ని అందజేస్తే దానిని హైవే అధికారులకు పంపుతామని కాంట్రాక్టర్ పేర్కొన్నారు.

ప్రీప్రైమరీ విధానం రద్దు చేయాలని అంగన్‌వాడీల ధర్నా



దోమకొండలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు ధర్నా చేసి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

దోమకొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పీఎం శ్రీ, ప్రీప్రైమరీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం అంగన్‌వాడీలు దోమకొండలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రాజెక్ట్ పరిధిలోని దోమకొండ, భిక్కనూరు, మాచారెడ్డి, బీబీపేట, రాజంపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నాలో పాల్గొన్నారు. ప్రీప్రైమరీ విధానంతో రెండు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు దూరమవుతారని వారు తెలిపారు. అనంతరం సీడీపీవో కార్యాలయ సిబ్బందికి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేష్, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు యాదమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాబాయి, ప్రతినిధులు పద్మజ, సునీత, రాణి, విజయ, కవిత, అనురాధ, సురేఖ, దేవిక తదితరులు పాల్గొన్నారు.

రేపు మార్కెట్ కమిటీ విశ్రాంత ఉద్యోగుల సమ్మేళనం

కామారెడ్డి అర్బన్: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం 11గంటలకు స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.హన్మంతు రెడ్డి, పి.విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మార్కెట్ కమిటీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

సంస్కృతికి నిలయాలు శిశు మందిరాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయాలు శిశు మందిరాలు అని ప్రముఖ వక్త హరిస్మరణ్‌రెడ్డి అన్నారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ వార్షికోత్సవం నిర్వహించారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా పాల్గొన్న వక్తలు మాట్లాడారు. పెరుగుతున్న టెక్నాలజీతో బంధాలు దూరమవుతున్నాయని, బంధాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శిశు మందిర్ అధ్యక్షుడు కొత్త దుర్గయ్య, పాపిని శ్రీనివాస్ సత్యప్రసాద్, ముదాం సాయిలు, శ్రీకాంత్, రాజిరెడ్డి, లక్ష్మినారాయణ, ప్రధానాచార్యురాలు సుమలత, శివ్వయ్య, చందు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాలయం వద్ద సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు



కల్యాణిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దకొడప్‌గల్/ఎల్లారెడ్డి/భిక్కనూరు : ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి, దావల్‌మల్కపల్లి గ్రామాలలో రూ. 5లక్షల ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా ప్రారంభించారు. బీబీపేటలోని 12వ వార్డులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ ప్రారంభించారు. భిక్కనూరులోని శ్రీసిద్ధరామేశ్వరాలయం వద్ద రూ.30 లక్షలతో, అయ్యవారిపల్లి గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండలం చిన్న తక్కడపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు.ఇందిరమ్మ ఇళ్ల సైట్ క్లీనింగ్ పనులు,సీసీ రోడ్డు నిర్మాణ పనులను మండల ప్రత్యేక అధికారి కిషన్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్‌గుప్తా



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడుగా పి.శ్రీకాంత్‌గుప్తాను నియామకం అయ్యారు. ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు ఎం.భూమేష్‌గుప్తా యువజన సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్‌గుప్తాకు నియమాక పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, ప్రతినిధులు నరహరి, వలపిశెట్టి లక్ష్మిరాజం, రాజేందర్, బాలాజీ, జి.శ్రీధర్ కే.శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాలల ప్రజ్ఞోత్సవాలు



గాంధారి(ఎల్లారెడ్డి): ప్రాథమిక పాఠశాలల ప్రజ్ఞోత్సవాలను మంగళవారం స్థానిక విద్యావనరుల కార్యాలయంలో ఘనంగా నిర్వహించినట్లు ఎంఈవో శ్రీహరి తెలిపారు. మండలంలోని వివిధ కాంప్లెక్స్ పాఠశాలల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, ఉపాన్యాస పోటీలు నిర్వహించి డీఈవో రాజు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న తోట బాల్‌రాజ్

దోమకొండ: ఒకే దేశం ఒకే ఎన్నికపై బీజేపీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తోట బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ కల్యాణ మండపంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. సమావేశంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు విపుల్ జైన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు వేణు, రవీందర్ రెడ్డి, నరేందర్, సుజాత, సిద్దిరాములు, విఠల్, కాశి రెడ్డి, దేవరాజు, మహేందర్ గౌడ్, లక్ష్మి నారాయణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ కిట్ల పంపిణీ

కామారెడ్డి రూరల్: ఇండియన్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఐడీఎఫ్) (ఇన్ అసోసియేషన్ విత్ ఫౌండర్) ఆధ్వర్యంలో కామారెడ్డి మండలం శాబ్దిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శానిటరీ కిట్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐడీఎఫ్ మెంబర్స్ సంజయ్‌రామ్, రాజేశ్వర్‌రావు, పాఠశాల ఉపాధ్యాయబృందం ఉన్నారు.

రాజంపేట తైబజార్ @ రూ.2.80 లక్షలు



తైబజార్ వేలం పాటలో పాల్గొన్న అధికారులు

రాజంపేట : స్థానిక జీపీ కార్యాలయంలో 2025–26 సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలంపాటను మంగళవారం ప్రత్యేక అధికారి రఘురాం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామానికి చెందిన మీర్‌అప్సర్ అలీ రూ.2.80 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విత్తనక్షేత్రంలోని మామిడికాత వేలం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్రంలోని మామిడిచెట్ల కాతకు మంగళవారం అధికారులు వేలంపాట నిర్వహించారు. ఎల్లారెడ్డి మండలానికి చెందిన దాసరి సుధాకర్ రూ.38వేలకు మామిడికాతను వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఇంద్రసేన్, ఏవో సాయికిరణ్, మాల్తుమ్మెద ఉద్యానక్షేత్ర హెచ్‌వో కమలాకర్‌రెడ్డి, ఏరువాకకేంద్రం కో–ఆర్డినేటర్ అనిల్‌రెడ్డి, ఏఈవో శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లింగంపేటలో తైబజార్..

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట గ్రామ పంచాయితీలో బుధవారం తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను తైబజార్, దడువాయి వేలం ఉదయం 12 గంటలకు గ్రామ పంచాయితీ ఆవరణలో వేలం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

మీసాన్‌పల్లిలో అగ్నిగుండాలు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని వీరభద్ర స్వామి వారి ఆలయంలో మంగళవారం అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి వార్షికోత్సవ వేడుకలలో భాగంగా అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించారు. అగ్ని గుండాల నుంచి భక్తులు నడిచి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శేఖరప్ప, గ్రామస్తులు తదితరులున్నారు.

సోమారంపేటలో హోమం



మాచారెడ్డి: మండలంలోని సోమారం పేట వీరాంజనేయస్వామి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రపంచశాంతి కోసం హోమం పూర్ణహుతి కార్యక్రమాలను జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు దేవయ్య,తదితరులు పాల్గొన్నారు.

నాచుపల్లిలో సప్తాహం

నస్రుల్లాబాద్ : మండలంలోని నాచుపల్లి గ్రామంలో సప్తాహం కొనసాగుతోంది. మంగళ వారం నర్సింలు మహరాజ్ ముంబాయి ఆధ్వర్యంలో గాథా సప్తశతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వార్కరీలు, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ కమిటీ ఏర్పాటు

తాడ్వాయి : మండలానికి కేంద్రంలోని మంగళవారం తాడ్వాయి గ్రామ ఊరి హనుమాన్ ఆలయ కమిటీ ఏర్పడినట్లు నిర్వాహకులు తెలిపారు.అధ్యక్షులుగా ఆరిబా భరత్ రావు ,ఉపాధ్యక్షులుగా ఆరిబా భాస్కరరావు కార్యదర్శిగా గొల్ల నవీన్, క్యాషియర్‌గా దత్తాత్రేయ కమిటీ సలహాదారులుగా మేకల రాజు, అంబీర్ శ్యామ్‌రావు, ముదాం నర్సింలు, బండారి సంజీవులు, రాజా గౌడ్ మరియు అడ్వైజర్లుగా సిద్ధిరాములు శరత్ పంతులు గార్లను ఎన్నుకున్నారు.

సంక్షిప్తం

నేడు గైనిక్ వైద్యురాలి పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ

కామారెడ్డి టౌన్: బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో సీమాంక్ స్కీం కింద ఖాళీగా ఉన్న ఒక ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణుల పోస్టు భర్తీ కోసం బుధవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్‌తో పాటు ఓబీజీ, గైనిక్ అర్హత కలిగిన వైద్య అభ్యర్థులు మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో పోలీస్ కళాబృందం సభ్యులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియాలో జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100,108,1930, 181లకు ఫోన్‌లు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి హరిత, పోలీస్‌కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కామారెడ్డి అర్బన్: ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నాలుగవ రోజు ఒకటి, రెండు, మూడు యూనిట్ల ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ స్కీం ఉమ్మడి జిల్లా విభాగం తరపున హాజరైన రిసోర్స్ పర్సన్ జి సుధాకర్ వలంటీర్లకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజగంభీర్‌రావు, చంద్రశేఖర్ గౌడ్, శారద, కోఆర్డినేటర్ అంకం జయప్రకాశ్, వలంటీర్లు పాల్గొన్నారు.

బోర్లంలో ఉచిత ఆరోగ్య శిబిరం

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో మంగళవారం సేవాసంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన శిబిరానికి మహిళలు హాజరయ్యారు. వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండలంలోని లింగంపల్లి(ఖుర్దు) అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా వండాలని సూచించారు.గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట అంగన్‌వాడీ టీచర్, కార్యదర్శి ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల తహసీల్దార్‌గా సురేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. లింగంపేటలో పనిచేసిన తహసీల్దార్ నరేందర్‌గౌడ్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సురేష్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయనను ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు సన్మానించారు.

నవోదయకు ఎంపిక

భిక్కనూరు: రామేశ్వరపల్లికి చెందిన రుశధ నవోదయకు ఎంపికైనట్లు భిక్కనూరు చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ బూర్ల రేణుకుమార్, ప్రధానోపాధ్యాయుడు అశోక్ యాదవ్ తెలిపారు. ఆమె తమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోందన్నారు. నవోదయకు ఎంపికైన రుశధను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.